క్లుప్తంగా

వడదెబ్బ తగలకుండా చర్యలు



ఓ దుకాణంలో సిబ్బందితో మాట్లాడుతున్న లేబర్ ఆఫీసర్ అంబటి సుందరరావు

సాలూరు: పని ప్రదేశంలో వడదెబ్బ తగులకుండా చర్యలు తీసుకోవాలని లేబర్ ఆఫీసర్ అంబటి సుందరరావు తెలిపారు. పట్టణంలోని పలు దుకాణాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బాల కార్మికులతో పనులు చేయించడం నేరమన్నారు. వేసవి దృష్ట్యా పని ప్రదేశాల్లో తాగునీరు, ఓఆర్ఎస్, ఐవీ ఫ్లూయిడ్స్ అందించాలని సూచించారు.

నిర్మానుష్యంగా రోడ్లు



నిర్మానుష్యంగా ఉన్న రాష్ట్ర రహదారి ఆర్వోబీ

సీతానగరం: ఎండలు తారెత్తిస్తున్నందున నిరంతరం ప్రయాణికులు తిరుగాడే మండలంలోని రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. నాలుగు రోజులు ఎండలు తీవ్రంగా ఉంటాయని ఉన్నతాధికారులు, వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో నిరంతరం వందలాది వాహనాలు, ప్రజలు తిరుగాడే ప్రధాన రోడ్లు బుధవారం నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ఎండలు తీవ్రంగా ఉండడంతో ఇళ్ల నుంచి బయటకు రావడానికి అవస్థలు పడుతున్నారు. ప్రజలెవరూ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రోడ్డుపైకి రావడం లేదు. ఎండల కారణంగా వర్తకులు సాయంత్రం, ఉదయం పూట మార్కెట్ చేసుకుని ఇళ్లకు చేరుకుంటున్నారు.

నిబంధనలు తప్పనిసరి

● ఐటీడీఏ పీఓ, ఇన్‌చార్జి జేసీ విష్ణుచరణ్



మడకవానివలసలో వేతనదారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

పార్వతీపురంటౌన్: ఉపాధిహామీ పనుల్లో నిబంధనలు పాటించాలని ఐటీడీఏ పీఓ, ఇన్‌చార్జి జేసీ విష్ణుచరణ్ సూచించారు. మండలంలోని మడకవానివలస గ్రామంలో ఉపాధిహామీ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



అడ్మిషన్ పొందిన చిన్నారులతో ఉపాధ్యాయులు

సాలూరు: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతోందని బాగువలస జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం జేమ్స్ తెలిపారు. నూతన విద్యార్థులను పాఠశాలలో చేర్పించేందుకు మండలంలోని బాగువలస, పెదపథం, గాదెలవలస, మిర్తివలస, పాలికవలస, తదితర గ్రామాల్లో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్పొరేట్ పాఠశాలల కంటే మెరుగైన స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో బోధన జరుగుతోందన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు యూనిఫారం, షూ, బ్యాగ్, పుస్తకాలు, తదితర అన్ని వస్తువులు ప్రభుత్వమే అందిస్తుందని చెప్పారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఆక్రమణలపై ఆర్డీఓ విచారణ



ఆర్డీఓ హేమలతకు సమస్యలను వివరిస్తున్న బాధిత రైతులు

సాలూరు: తమ భూములు అన్యాక్రాంతమయ్యాయని, ప్రభుత్వ చెరువుల దురాక్రమణలపై పలువురు గిరిజన, బాధిత రైతులు వేర్వేరుగా స్పందనలో చేసిన ఫిర్యాదులపై ఆర్డీఓ హేమలత బుధవారం దత్తివలసలో విచారణ చేపట్టారు. తమ డీపట్టా భూములు అన్యాక్రాంతమయ్యాయని గ్రామానికి చెందిన దత్తివలస, మామిడిపల్లి రెవెన్యూ పరిధిలో గల పలువురు రైతులు గొమ్మి వెంకటస్వామి, కోట చిన్నయ్య, బొమ్మి రామస్వామి తదితరులు.. తమ పూర్వీకులు నుంచి వస్తున్న జరాయితీ భూమిని కొందరు వ్యక్తులు దురాక్రమణకు పాల్పడ్డారని పట్టణానికి చెందిన ఇప్పిలి రాజేశ్వరి, తదితరులు ఆర్డీఓకు తెలుపుతూ తమ వద్ద ఉన్న ఆధారాలను చూపించారు. దీనిపై ఆర్డీఓ మాట్లాడుతూ, భూముల అంశంపై మూడు రోజుల్లో సంపూర్ణ నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామానికి చెందిన మజ్జి నారాయణ మాట్లాడుతూ, రెవెన్యూ పరిధిలో 17 చెరువులు ఉండేవని.. ప్రస్తుతం చెరువులన్నీ కబ్జాకు గురయ్యాయని తెలిపారు. దీనిపై ఆర్డీఓ స్పందిస్తూ, రోజుకో చెరువు చొప్పున సర్వే చేసి ఆక్రమణదారులకు నోటీసులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామస్వామి, రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

● ఎ.ఈశ్వరరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి



సీతానగరంలో పొలాల్లో గొర్రెలకు వేస్తున్న పీపీఆర్ వ్యాక్సిన్ పరిశీలిస్తున్న ఎ.డి డాక్టర్ దీనకుమార్



గిరిజన గ్రామాల్లో పశువులకు వేస్తున్న వ్యాధినిరోధక టీకీలను పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ ఈశ్వరరావు



లక్ష్మీపురం సచివాలయం వద్ద ఆవుకు వ్యాక్సిన్ వేస్తున్న వీఏఏ పద్మ



1962 పశు సంచార వైద్యకేంద్రం

సీతానగరం: పశుసంరక్షణ, ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్రప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడంతో ముందు జాగ్రత్త చర్యగా పశువులకు వ్యాధినిరోధక టీకాలు వేసేందుకు ఉచిత పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎ.ఈశ్వరరావు చెప్పారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ ధుల నివారణకు అవసరమైన మందులు ప్రభుత్వం సమకూర్చడం వల్ల సచివాలయాల్లో పశువైద్యసహాయకులు ఉన్నందున పశువులున్న రైతులు సమీపంలో ఉన్న ఆర్బీకేలు, గ్రామీణ పశువైద్య కేంద్రాలకు తరలించి పశువైద్యాధికారుల పర్యవేక్షణలో సేవలను పొందుతున్నారని చెప్పారు. పశువులకు బొబ్బర వ్యాధి, నోటిసంచలు, కాళసంచల వ్యాధుల నివారణకు టీకా వేస్తున్నట్లు తెలిపారు. గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాధి నివారణకు ముందుజాగ్రత్త చర్యలో భాగంగా వ్యాక్సిన్ వేస్తున్నామన్నారు. కోళ్లకు కొక్కెర వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నట్లు తెలిపారు.

పశువులవ్యాధుల నివారణకు సిద్ధంగా మందులు



వర్షాకాలంలో వచ్చే వ్యాధులపట్ల అప్రమత్తమై ముందుజాగ్రత్త చర్యగా పశువులకు వ్యాక్సిన్లు వేశాం. గొర్రెలు మేకలకు నట్టల నివారణమందులు ఇచ్చాం. పొలాల్లో ప్రమాదానికి గురై ఇబ్బంది పడుతున్న సమయంలో పశువులకు తక్షణ వైద్యసేవలందించడానికి 1962 సంచార వాహనాలను మండలానికి ఒకటి వంతున ప్రభుత్వం మంజూరు చేసింది. పశువులున్న రైతులు వినియోగించుకోవాలి.

ఎ.ఈశ్వరరావు, జిల్లా పశువైద్యాధికారి పార్వతీపురంమన్యంజిల్లా.

అంటువ్యాధులపై అప్రమత్తం



బల్లిలో వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న హోలీస్పిరిట్ సిబ్బంది

బలిజిపేట: అంటువ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హోలీస్పిరిట్ సిస్టర్ జీవా సూచించారు. మండలంలోని బల్లిలో అంటువ్యాధులు, వేసవిలో వడదెబ్బలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వేసవిలో పనులకు వెళ్లేవారు వడదెబ్బకు గురికాకుండా చూసుకోవాలని సూచించారు. వడదెబ్బకు గురయ్యేవారికి వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుందని, ఎప్పటికప్పుడు మంచినీరు, మజ్జిగ తీసుకోవాలన్నారు. అదేవిధంగా అంటువ్యాధులు సోకకుండా జాగ్రత్తలు పాటించాలని హితవు పలికారు. అంటువ్యాధులు సోకితే వ్యాప్తిచెందకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముందన్నారు. అలాగే దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్న వారు సమయానుకూలంగా మందులు వినియోగించాలని, ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో తవిటయ్య, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● ఫారెస్ట్ రేంజర్ కె.రామారావు



ప్రతిజ్ఞ చేస్తున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది

సాలూరు: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని సాలూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కె.రామారావు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, డీఎఫ్ఓ ప్రసూన ఆదేశాల మేరకు పర్యావరణ పరిరక్షణపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమాల్లో అటవీశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



ఇంజినీరింగ్ అసిస్టెంట్స్‌తో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ ప్రసాద్‌బాబు

బలిజిపేట: మండలంలో వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలను పూర్తిచేయించాలని పార్వతీపురం మన్యం జిల్లా డీఈ ప్రసాద్‌బాబు కోరారు. ఈ మేరకు బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి మంజూరైన 2,507గృహాలలో 1,369 పూర్తయ్యాయని మిగిలిన వాటిని పూర్తిచేయించాలని సూచించారు. లబ్ధిదారులను సంప్రదించి వారికి ఉన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా అడుగులు ముందుకువేసి త్వరితగతిన గృహనిర్మాణాలు పూర్తిచేయాలని సూచించారు. జూన్, 30వ తేదీ నాటికి గృహనిర్మాణాలు పూర్తి చేయించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏఈ జానకీరామ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గోగు విత్తన ఎంపికకు ప్రాధాన్యం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

బలిజిపేట: గోగు పంట ఉత్పత్తి, విత్తన ఎంపికపై మండలంలోని మిర్తివలస ఆర్బీకేలో జూట్ కార్పొరేషన్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. గోగు పంటలో తోసా రకమైన జేఆర్ఓ-204పంట రకం ఎకరాకి కిలో విత్తనాలు డ్రమ్ సీడర్‌లో విత్తుకుంటే మంచి పంట దిగుబడి వచ్చే అవకాశాలున్నాయని జేసీఐ మార్కెటింగ్ మేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ పంట 90రోజులకు ఖరీఫ్‌లో కోతల సమయానికి ఊరవేతకు వస్తుందన్నారు. ఈ పంటను జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని చెప్పారు. ఆసక్తి కలిగిన రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని మంచి పంటను పండించి, మద్దతు ధర పొందగలరని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏఓ శ్రావణ్, రైతులు పాల్గొన్నారు.

చెరకు సాగుపై రైతుల దృష్టి



బోదెలపై వేసిన చెరకు విత్తనం



బోదెలపై విత్తనం ముక్కలు నాటుతున్నమహిళా రైతులు



అంకలాంలోసిద్ధంగా చెరకువిత్తనం

సీతానగరం: వాణిజ్య పంట చెరకు సాగుకు ప్రభుత్వం రాయితీలు ప్రకటించడం, రాయితీపై క్రిమి సంహారక మందులు సమకూర్చడంతో రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. నీటివనరులున్న గ్రామాల రైతులు ఖాళీగా ఉన్న భూమిని చదును చేసి చెరకు విత్తనం వేయడానికి అనుకూలంగా ఉండడం, పొలం పనులుతగ్గుముఖం పట్టడంతో పలు గ్రామాల్లో చెరకు విత్తనం నాటుతున్నారు. చెరకు సాగు పనుల దృశ్యాలిలా ఉన్నాయి.

సంతాపం

సాలూరు: మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ మురళీధర్ మృతికి కమిషనర్ శంకరరావు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ శంకరరావు మాట్లాడుతూ, మురళీధర్ కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని చెప్పారు. విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడని తెలిపారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం ఘనత సీఎం జగనన్నదే

● ఎమ్మెల్యే అలజంగి జోగారావు



గంగాపురం పంచాయతీలో ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పార్వతీపురం మండలంలోని గంగాపురం పంచాయతీ తాన్నవలస, తొక్కుడువలస, పనసభద్ర, కోరె గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలకు వచ్చిన ఎమ్మెల్యేకు ఆయా గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే గడపగడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. అమ్మ ఒడి వచ్చిందా, రైతు భరోసా వచ్చిందా, పింఛన్ ఇంటివద్దకే వచ్చి ఇస్తున్నారా అంటూ ఆరా తీశారు. సంక్షేమ పథకాల అమలు తీరును వివరించిన ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అర్హులకు ఏదైనా అన్యాయం జరుగుతుందా తదితర విషయాలు తెలుసుకునేందుకే వచ్చామని వివరించారు. లబ్ధిదారులు సంతృప్తి చెందడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కులాలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. రాష్ట్రప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధిని సమపాళ్లలో అందిస్తోందని చెప్పారు.

ప్రతిపక్షాల మాటలను ప్రజలు నమ్మరు

ప్రతి కుటుంబానికీ ఏదో ఒక సంక్షేమ పథకం అందజేస్తూ పేదల అభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలుస్తున్న తీరును ఓర్వలేక టీడీపీ, జనసేన నాయకులు కొందరు అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ సిద్దా జగన్నాథరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, స్థానిక సర్పంచ్ సింగిరెడ్డి లక్ష్మి, శ్రీరాములునాయుడు, ఆత్మ చైర్మన్ తిరుపతిరావు, నాయకులు మజ్జిశేఖర్, బి.కృష్ణమూర్తి, ఎం విశ్వనాథం, వి.గుర్రాజు, ఎం .సత్యం నాయుడు, ఎంపీటీసీ సభ్యులు స్టేట్‌కార్పొరేషన్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు జేసీఎస్ కన్వీనర్, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి



చిలకలపల్లిలో ప్రత్యేక డ్రైవ్ చేస్తున్న ఉపాధ్యాయులు

బలిజిపేట: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ చిలకలపల్లి, పెదపెంకి ఉన్నత పాఠశాలల ఆధ్వర్యంలో గ్రామాల్లో బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం వల్ల విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, భోజనం, బ్యాగులు, షూలు, యూనిఫాం పంపిణీచేస్తామని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకంలో మంచి పౌష్టికాహారం అందిస్తారని తెలిపారు. వాటికి తోడు మంచి విద్యను బోధించే ఉపాధ్యాయులు ఉన్నారని వారితో సబ్జెక్టుల వారీగా విద్యాబోధన సాగుతుందని తెలిపారు. గడిచిన విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులే పదవ తరగతి పరీక్షల్లో మండల ఫస్ట్, సెకెండ్, థర్డ్ స్థానాలు పొందారని తెలిపారు. అందులో భాగంగా చిలకలపల్లిలో 3వ తరగతికి వచ్చే విద్యార్థులు 16మంది ఉన్నారని, వారి తల్లిదండ్రులను కలవగా అందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తామని హామీ ఇచ్చారని ప్రధానోపాధ్యాయుడు ఎం.గౌరీశంకర్ తెలిపారు. కార్యక్రమంలో డి.జానకి, కె.ఎస్ఎన్ మూర్తి, ఆర్.శంకరరావు, సురేష్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫస్ట్‌ఫేజ్ రీసర్వే భూముల్లో సర్వే రాళ్ల ఏర్పాటు పూర్తి



పాపమ్మవలసలో సర్వే రాళ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: జగనన్న సంపూర్ణ 'భూ'రక్ష 'భూ'హక్కు పథకం అమలులో భాగంగా మండలంలో నిర్వహించిన రీసర్వే ఫేజ్ వన్ గ్రామాల్లో సర్వే రాళ్లు వేయడం పూర్తయిందని తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. ఈ మేరకు బుధవారం రీసర్వే డీటీ పి.చిట్టిమ్మతో కలిసి పాపమ్మవలస, నీలకంఠాపురం గ్రామాల్లో భూమి హద్దుల్లో పాతిన రాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 సంవత్సరాల క్రితం భూముల రీసర్వే జరిగిందని తాజాగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో 2020లో రీసర్వే ప్రక్రియ ఆరంభించినప్పటికీ కరోనా కారణంగా ఎమర్జెన్సీ ప్రకటించడంతో రీసర్వే పనులు ముందుకు సాగలేదన్నారు. 2021-22 ఆర్థిక సంవత్సరం నుంచి రీ సర్వే ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో సీతానగరం మండలంలో 44 గ్రామాలుండగా జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు ఫేజ్ వన్ కింద కొత్తవలస, గంగరాజపురం, చిన్నారాయుడుపేట, నీలకంఠాపురం, పాపమ్మవలస, బగ్గందొరవలస గ్రామాలను గుర్తించి డ్రోన్ సర్వే, రోవర్ విధానం ద్వారా సర్వే నిర్వహించడంతో పాటు గ్రామసభలు నిర్వహించి భౌతికంగా జిరాయితీ, ప్రభుత్వ, చెరువులు నదులకు సంబంధించిన భూములను పరిశీలించామన్నారు. రైతుల సూచనలతో పాటు ప్రభుత్వ రెవెన్యూ రికార్డుల్లో ఉన్న నివేదికల ఆధారంగా సర్వే నిర్వహించిన సిబ్బంది లెక్కల ఆధారంగా సర్వే రాళ్లు వేసినట్లు చెప్పారు. రాళ్లు నిర్దేశించిన స్థలాల్లో పాతినప్పటికీ లోపభూయిష్టంగా పాతడంపై తహసీల్దార్ తప్పుబట్టారు. రాయిపై ఉన్న యారో మార్క్ ఆధారంగా రాళ్లు వేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్వే సిబ్బంది వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ బాగాది జగన్నాథ రావు

సీతానగరం: మండలంలో వైరల్ జ్వరాలతో ఇబ్బందులు పడుతున్న వారికి సకాలంలో వైద్య సేవలందించడం వల్ల జ్వరాలు తగ్గుముఖం పట్టాయని జిల్లావైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని రెడ్డివానివలసలో జ్వరాలు సోకడానికి గల కారణాలపై డీఎంహెచ్ఓ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలని, గ్రామంలో శానిటేషన్ చేయించాలని సర్పంచ్ పెంట సత్యం నాయుడికి సూచించారు. గ్రామంలో వైద్య సేవలందిస్తున్న వైద్య సిబ్బంది నుంచి ఇక్కడి జ్వరాల పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం రెడ్డివానివలసలో జ్వరాలు తగ్గుముఖం పట్టాయని, ఎండలు తీవ్రంగా ఉన్నందున ఎవరూ బయటకు రావడం లేదన్నారు. గ్రామమంతా కలియదిరిగి ఎక్కడికక్కడ పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యసిబ్బంది వారం రోజులుగా గ్రామంలో ఉండి వైద్యసేవలు అందించినందున జ్వరాల తీవ్రత తగ్గుముఖం పట్టినట్లు సర్పంచ్ పెంట సత్యంనాయుడు తెలియజేశారు. జ్వరాలు తగ్గినా అవసరమైన మందులను గ్రామంలో వైద్యసిబ్బంది అందుబాటులో ఉంచాలని పూర్తిస్థాయిలో నిర్మూలన అయ్యేవరకూ వైద్య పర్యవేక్షణ కొనసాగించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శిరీష, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, ప్రసాద్, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధికే అధిక ప్రాధాన్యం



శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జోగారావు

● ఎమ్మెల్యే అలజంగి జోగారావు


పార్వతీపురం టౌన్: ప్రభుత్వం అభివృద్ధికే ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన పట్టణంలోని గడ్డివీధి, కృష్ణాకాలనీలో సీసీరోడ్డు, డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజలు సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించాలని కోరారని, వారి వినతి మేరకు రూ.10లక్షల నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించామని చెప్పారు. పట్టణాభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించి అభివృద్ధి పథంలో తీసుకువెళ్తోందన్నారు. అలాగే కాలనీలో ఉన్న చిన్నచిన్న సమస్యలు సైతం పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, స్థానిక కౌన్సిలర్‌లు రణభేరి బంగారునాయుడు, రణభేరి చిన్నంనాయుడు, సంగంరెడ్డి లక్ష్మీపార్వతి, కోఆప్షన్ సభ్యులు వెంకట్రావు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన ఏఎస్పీ

సీతానగరం: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను పార్వతీపురం సబ్ డివిజినల్ ఏఎస్పీ సునీల్ షీయోరన్ బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని అన్ని రికార్డులను పరిశీలించారు. గతంలో క్రైం వివిధ కేసుల గురించి ఆరా తీశారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసులు, గ్రామాల్లో శాంతి భద్రతల గురించి అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సక్రమంగా పని చేసి కేసుల దర్యాప్తు ఎప్పటికప్పుడు పురోగతి సాధించాలని సూచించారు. ఎస్సై కె.నీలకంఠం, ఏఎస్సై శ్రీనివాసరావు, సిబ్బంది స్టేషన్‌లో ఉన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలతో భూసారం

● ఏఓ తిరుపతిరావు



రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్న ఏఓ తిరుపతిరావు

పాచిపెంట : నవధాన్య పచ్చిరొట్ట విత్తనాలతో భూమికి అధిక భూసారం లభిస్తుందని వ్యవసాయ అధికారి కె. తిరుపతిరావు అన్నారు. మండలంలోని రాయిగుడ్డివలస రైతుభరోసా కేంద్రం వద్ద రైతులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం భూమిలో సేంద్రియ కార్బన్ 0.01% శాతం మాత్రమే ఉందని.. దీనిని కనీసం ఒక్క శాతానికి పెంచినప్పుడే వ్యవసాయానికి యోగ్యమైన భూములుగా పరిగణించవచ్చనన్నారు. రసాయన ఎరువులకు పంటలు సరిగా ప్రతిస్పందించాలంటే భూమిలో సేంద్రియ కర్బనం ఉండాలని.. దీన్ని వృద్ధి చేయాలంటే నవధాన్య పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేయాలని సూచించారు. ఎకరానికి 12 కిలోల నవధాన్య పచ్చిరొట్ట విత్తనాలను చల్లుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ సాయి గణేష్, ప్రకృతి సేద్య సిబ్బంది యశోదమ్మ, తిరుపతి, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.